అనుక్షణం ప్రజల పక్షం
RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
J V NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 2 సంచిక - 294 శుక్రవారం 20 ఫిబ్రవరి 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts



5

## 26 నుంచి తెలంగాణ బడ్జెట్ సమావేశాలు



మన ఆలోచనలకు అందనంతగా ఏఐ

భారత్‌లో ఏఐ పురోభివృద్ధి చరిత్రగా నిలుస్తుంది

ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సు లో ప్రధాని మోడీ



# మానవ అభివృద్ధిలో ఎఐ కీలకం

న్యూఢిల్లీ/ఫిబ్రవరి 19 (జర్నలిస్ట్ వార్త):
ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సామర్థ్యం మన ఆలోచనలకు అందనంత దూరంలో ఉందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ఏఐ వినియోగం చట్టబద్ధంగా, పునఃసమీక్షించేలా ఉండాలని చెప్పారు. దేశ రాజధాని ఢిల్లీలో జరుగుతున్న 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సు' లో గురువారం ప్రధాని ప్రసంగించారు. మానవ అభివృద్ధిలో ఏఐ కీలక భూమిక పోషిస్తోందని ప్రధాని తెలిపారు. మిగతా 2లో..

AI IMPACT SUMMIT
भारत 2026 INDIA

# పాలన భేష్

## : రేవంత్ రెడ్డి సహా తెలంగాణ నేతలకు ఖర్గే, రాహుల్ గాంధీ ప్రశంసలు


ఢిల్లీలోని ఖర్గే నివాసంలో సమావేశమైన తెలంగాణ కాంగ్రెస్ నాయకులు

భవిష్యత్తు కార్యాచరణపై చర్చించినట్లు తెలిపిన మల్లికార్జున ఖర్గే

సమానత్వంతో కూడిన తెలంగాణ నిర్మాణానికి కట్టుబడి ఉన్నామని ఉద్ఘాటన



న్యూఢిల్లీ/ఫిబ్రవరి 19 (జర్నలిస్ట్ వార్త):
సమానత్వంతో కూడిన తెలంగాణ నిర్మాణం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, 'ప్రజల తెలంగాణ' లక్ష్యాన్ని సాధించే దిశగా కార్యాచరణను రూపొందించినట్లు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. సామాజిక సంక్షేమం, ఆర్థిక సాధికారత, ప్రతి పౌరుడికి న్యాయం అందించడం తమ ప్రధాన సంకల్పమని ఆయన వెల్లడించారు 2లో...



## విశాఖలో వేడుకగా 'ఇంటర్నేషనల్ సిటీ పరేడ్'

భారత దళాలతో పాటు పలు దేశాల నావికాదళాల కవాతు

అబ్బురపరిచిన వైమానిక విన్యాసాలు, కమాండోల ప్రదర్శనలు

ముఖ్య అతిథిగా పాల్గొన్న గవర్నర్ అబ్దుల్ నజీర్

వివిధ దేశాల సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి

విశాఖపట్నం /ఫిబ్రవరి 19 (జర్నలిస్ట్ వార్త):
'సిటీ ఆఫ్ డెస్టినీ' విశాఖపట్నం సాగర తీరం గురువారం సాయంత్రం అద్భుత ప్రదర్శనలకు వేదికైంది. ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ మిలన్ 2026 వేడుకల్లో భాగంగా ఆర్కే బీచ్‌లో నిర్వహించిన అంతర్జాతీయ నగర పరేడ్ కన్నుల పండువగా సాగింది. భారత నావికాదళ శక్తి సామర్థ్యాలు, వివిధ దేశాల సాంస్కృతిక వైభవానికి ఈ పరేడ్ దర్పణం పట్టింది.మిగతా 2లో...

## ఉచిత పథకాలపై సుప్రీంకోర్టు అసహనం..



ఎలాంటి సంస్కృతిని అభివృద్ధి చేస్తున్నామని మండిపాటు!

అందరికీ ఉచిత విద్యుత్తును ప్రకటించిన స్టాలిన్ ప్రభుత్వం

రాష్ట్ర ఆర్థిక స్థితిని పట్టించుకోకుండా ఉచిత విద్యుత్ ఎలా ఇస్తారన్న సుప్రీం

దేశ అభివృద్ధి దెబ్బతింటుందని వ్యాఖ్య

## కర్రెగుట్టల్లో భారీ ఎన్‌కౌంటర్

దేవ్‌జీ లక్ష్యంగా కూంబింగ్

ఐదురుగు మావోలు మృతి చెందినట్లు గుర్తింపు



రాయపూర్,/ఫిబ్రవరి 19 (జర్నలిస్ట్ వార్త):
ఛత్తీస్‌గఢ్‌లో మళ్లీ భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. భద్రతా బలగాల కాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు మృతిచెందారు. మావోయిస్టు అగ్రనేత,మిగతా 2లో...

## ఆరు గ్యారెంటీలు సహా హామీలపై

# స్పష్టత ఇవ్వాలి

ఇచ్చిన హామీ మేరకు కేటాయింపులు చేపట్టాలి

ఈ బడ్జెట్‌లో కేటాయింపులతో నిజాయితీ చాటాలి

## సిఎం రేవంత్‌కు కెటిఆర్ లేఖ

హైదరాబాద్/ఫిబ్రవరి 19 (జర్నలిస్ట్ వార్త):
ఆరు గ్యారెంటీల పేర్లు చెప్పి అధికారంలోకి వచ్చి వాటి అమలను పక్కన పెట్టారని, ఇప్పటి వరకు ప్రవేశపెట్టిన రెండు బడ్జెట్‌లో కేటాయింపులు చేయలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఆరు గ్యారెంటీలో హామీ ఇచ్చిన మహిళలు, వృద్ధులు, విద్యార్థి, యువత, రైతన్నల కోసం భారీగా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. డిక్లరేషన్ల పేరుతో హామీలు ఇచ్చిన మేరకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ఈ బడ్జెట్లో నిధులు కేటాయించాలని కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగలేఖ రాశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చి దాదాపు సగం కాలం పూర్తవుతున్నా ,ఇప్పటికీ హామీల్లో 95 శాతం పెండింగ్‌లోనే ఉన్నాయని ఆరోపించారు.





## నకిలీ మానవ హక్కుల సంఘాలపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఉక్కుపాదం...

వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశం

రెండు వారాల్లోగా నివేదిక సమర్పించాలని స్పష్టం చేసిన ఎన్‌హెచ్‌ఆర్‌సీ

ఢిల్లీలో రిజిస్టర్ అయిన ఓ నకిలీ సంస్థపై ప్రత్యేకంగా దృష్టి




## మేలో పార్టీ

ప్రధాన ప్రతిపక్షంగా ఎదుగుతాం

అధికారంలోకి రావడం ఖాయం

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత



అనుక్షణం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక



# నకిలీ మానవ హక్కుల సంఘాలపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఉక్కుపాదం...

**న్యూఢిల్లీ /ఫిబ్రవరి 19 (జర్నలిస్ట్ వార్త):**
తమ పేరును పోలిన పేర్లతో రిజిస్టర్ అయి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న నకిలీ సంస్థలు, వ్యక్తులపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) తీవ్రంగా స్పందించింది. ఇలాంటి సంస్థలపై దేశవ్యాప్తంగా కఠిన చర్యలు తీసుకోవాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను ఆదేశించింది. ఈ మేరకు తీసుకున్న చర్యలపై రెండు వారాల్లోగా నివేదిక సమర్పించాలని గురువారం స్పష్టం చేసింది. ఇటీవల తమ దృష్టికి వచ్చిన ఓ ఘటనను ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఉదహరించింది. ఢిల్లీ ప్రభుత్వంతో 2022లో 'నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ)' పేరుతో ఓ ఎన్జీవో రిజిస్టర్ అయినట్లు ఫిర్యాదులు అందాయని తెలిపింది. ఆ సంస్థ తమకు నీతి ఆయోగ్, కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, సామాజిక న్యాయ మంత్రిత్వ శాఖల గుర్తింపు ఉందని ప్రచారం చేసుకుంటోందని పేర్కొంది. కర్ణాటకకు చెందిన వెంకటేశ్ అనే వ్యక్తి ఈ సంస్థకు 'స్టేట్ చైర్మన్'గా వ్యవహరిస్తున్నట్లు తేలిందని వెల్లడించింది. ఈ వ్యవహారం తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న కమిషన్, దీనిపై సుమోటోగా విచారణ చేపట్టింది. ఇలాంటి మోసపూరిత పేర్లు ప్రజలను గందరగోళానికి గురిచేస్తాయని, ఈ సంస్థలు ఎన్‌హెచ్‌ఆర్‌సీలో భాగమని లేదా తమచే గుర్తింపు పొందాయని భ్రమ కల్పిస్తున్నాయని అభిప్రాయపడింది. ఇది ప్రజల్లో కమిషన్ పట్ల నమ్మకాన్ని దెబ్బతీయడమే కాకుండా, నిధుల దుర్వినియోగానికి దారితీసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. గతంలో పలుమార్లు హెచ్చరించినా, ఉల్లంఘనలు కొనసాగుతున్నాయని పేర్కొంది. ఈ నేపథ్యంలో, అన్ని రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల చీఫ్ సెక్రటరీలు, డీజీపీలకు నోటీసులు జారీ చేసింది. ఎన్‌హెచ్‌ఆర్‌సీ పేరును దుర్వినియోగం చేస్తున్న సంస్థలను గుర్తించి, వాటి రిజిస్ట్రేషన్లను రద్దు చేయడంతో పాటు తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ప్రత్యేకించి, ఢిల్లీలో రిజిస్టరై కర్ణాటకలో కార్యకలాపాలు సాగిస్తున్న సదరు నకిలీ సంస్థపై తీసుకున్న చర్యలపై రెండు వారాల్లో నివేదిక ఇవ్వాలని ఢిల్లీ, కర్ణాటక రాష్ట్రాల ఉన్నతాధికారులను ఆదేశించింది.

# ఆరు గ్యారెంటీలు సహా హామీలపై స్పష్టత ఇవ్వాలి

ఈ సారైన బ్జడెట్ లో కేటాయింపులు చేయాలని లేనిపక్షంలో తెలంగాణ సమాజం ఇంకా ఓపికపట్టే ప్రసక్తే లేదని గుర్తుచేశారు. ఆయా వర్గాలకు రెండు సంవత్సరాలుగా ఎగ్గొట్టిన హామీలను, కాంగ్రెస్ ఇస్తామని చెప్పిన నిధుల బకాయిలకు ఈ బడ్జెట్లో కేటాయింపులు చేయాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత తీసుకువస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం దాని నిలబెట్టుకోవాలన్నారు. ఈసారి కూడా హామీల అమలకు నిధులు కేటాయించకుంటే ప్రజల తరఫున ప్రభుత్వం పైన ఒత్తిడి తీసుకొస్తామని , మోసకారి కాంగ్రెస్‌ను ప్రజలపక్షాన నిలదీస్తామని హెచ్చరించారు. త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెడుతున్న ఈ తరుణంలో 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మీరిచ్చిన హామీల గురించి తెలంగాణ ప్రజల పక్షాన గుర్తుచేసేందుకే ఈ లేఖ రాస్తున్నానని వెల్లడించారు. తెలంగాణ ప్రజలకు ఆరు గ్యారెంటీలు, 420 హామీల పేరిట మభ్యపెట్టి రెండేళ్లు గడిచినా ఇప్పటికీ అమలుకు నోచుకోని నేపథ్యంలో, కనీసం ఈ సారి బ్జడెట్ లోనైనా అవసరమైన నిధులు కేటాయించాలని కోరుతూ నాలుగు కోట్ల ప్రజల పక్షాన మిమ్మల్ని కోరుతున్నానని అన్నారు. వృద్ధులు, వితంతువులకు అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పెన్షన్‌ను నాలుగు వేలకు పెంచడానికి ఎన్ని నిధులు కావాలో లెక్కగట్టి ప్రతి పైసాను ఈ సారి బడ్జెట్‌లో కేటాయించాల్సిన బాధ్యత మీపై ఉంది. అలాగే రాష్ట్ర జనాభాలో సగభాగంగా ఉన్న ప్రతి ఒక్క మహిళకు మహాలక్ష్మి కింద నెలకు రూ. 2500లు అందజేస్తామని హామీ ఇచ్చి 25 నెలలు గడిచినా ఇప్పటికీ ఒక్క లబ్దిదారుకు ఒక్క పైసా దక్కలేదు. అందుకే ఈసారి బ్జడెట్ కేటాయింపుల్లో ఈ గ్యారెంటీ అమలుకు అడుగులు పడకపోతే ఆడబిడ్డలు ఊరుకునే ప్రసక్తే లేదనే విషయాన్ని గుర్తుచేస్తున్నాను. అలాగే కేసీఆర్ గారి హయాంలో తెలంగాణను పంజాబ్ నే తలదన్నేలా, దేశానికే ధాన్యాగారంగా తీర్చిదిద్దిన రైతులకు అందిన




రైతుబంధును 15 వేలకు పెంచుతామని మాటిచ్చి మోసం చేసినందుకు ముందు క్షమాపణలు చెప్పి, ఆ మొత్తాన్ని బ్జడెట్ లో కేటాయించాలని అన్నదాతల పక్షాన కోరుతున్నాను. అలాగే ఇప్పటికే మూడుసార్లు పెండింగ్‌లో పెట్టిన రైతుబంధు పాత బకాయిలను కూడా చెల్లించాలన్న రైతుల డిమాండ్‌ను మీ ముందు ఉంచుతున్నాను. అలాగే కౌలు రైతులకు, రైతు కూలీలకు కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం వారి ఖాతాల్లో నిధులు జమ చేయాలని కోరుతున్నాను. కేవలం రైతులు, మహిళలకే కాదు,
నిరుద్యోగులకిచ్చిన ప్రతి హామీ కూడా రెండేళ్ల నుంచి పెండింగ్ లోనే ఉంది. తొలి ఏడాదే రెండులక్షల ఉద్యోగాల భర్తీతోపాటు, జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి వంటి హామీల అమలుకు కూడా బ్జడెట్ లో కేటాయింపులు చేయాలని తెలంగాణ యువతీ యువకుల పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాను. అలాగే ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డ ఆటో డ్రైవర్లకు ఇస్తానన్న ఆర్థిక సహాయం అందజేయడానికి 2026-2027 బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించాలని కోరుతూ బీఆర్ఎస్ పక్షాన కోరుతున్నాను. ప్రజాపాలన పేరిట మరొక్కసారి ప్రజలను మభ్యపెట్టడానికి, నిట్టనిలువునా మోసగించడానికే సన్నాహాలు చేస్తున్నట్లు కనబడుతోంది. అలాగే పనికిరాని అంశాలను తెరపైకి తెచ్చి ప్రతిసారి అటెన్షన్ డైవర్ట్ చేయాలని మీరు చేస్తున్న కుట్రలు తెలంగాణ సమాజానికి అర్థమైపోయాయన్నారు. మొదటి క్యాబినెట్ లోనే 6 గ్యారంటీలకు చట్టబద్ధత తీసుకువస్తామని నాడు పీసీసీ అధ్యక్షుడిగా మీరు హామీ ఇచ్చిన విషయాన్ని మీరు మరిచిపోయినట్టు నటించినా, ప్రజలకు మాత్రం అన్నీ గుర్తున్నాయనే విషయాన్ని స్పష్టంచేస్తున్నాను. నాటి గ్యారంటీ కార్డులే ఇవాళ బాకీ కార్డులై మీ పాపాలను ప్రజాక్షేత్రంలో ప్రశ్నిస్తున్నాయి.. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ కింద ఈ రెండేళ్లలో పెళ్లి చేసుకున్న ఆడిబిడ్డల తల్లులందరికీ తులం బంగారం బాకీ పడ్డారు. యువ వికాసం కింద రూ. 5 లక్షల విద్యా భరోసా కార్డు ఇవ్వనే లేదు. విద్యార్థినులకు స్కూటీలు రానేలేదు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా వేల కోట్లు బాకీ పేరుకుపోవడంతో విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడే ప్రమాదం పొంచి ఉంది. ఇలా చెప్పుకుంటూ పోతే 42 పేజీల అభయహస్తం మేనిఫెస్టోలోని 420 హామీల్లో 5 శాతం కూడా అమలు చేయకుండా తెలంగాణ ప్రజలను దగా చేసిన ఘనచరిత్ర కాంగ్రెస్ పార్టీకే
దక్కుతుందన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న హామీని మాట మార్చి ఐదేళ్లలో భర్తీ చేస్తామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొనడం నిరుద్యోగ యువత గొంతుకోయడమే . అంతేకాదు నిరుద్యోగులకు ప్రతి నెలా రూ. 4 వేల నిరుద్యోగ భృతి చెల్లిస్తామన్న వాగ్దానాన్ని పూర్తిగా గంగలో కలిపి ఇప్పటివరకు నయా పైసా కూడా చెల్లించకుండా యువతను మోసగించారు. అభయహస్తంలో పొందుపరిచిన గ్యారెంటీలు, 420 హామీల అమలుకు ఎన్ని నిధులు అవసరమో ప్రకటించి బడ్జెట్‌లో ప్రతి పైసాకు లెక్క కట్టాలని తెలంగాణలోని సకల జనుల తరపున డిమాండ్ చేస్తున్నాను. అని లేఖలో కేటీఆర్ పేర్కొన్నారు.

# మంచి ఫలితాలు సాధించారు

**(మొదటి పేజి తరువాయి)**
ఢిల్లీలోని మల్లికార్జున ఖర్గే నివాసంలో తెలంగాణ కాంగ్రెస్‌కు సంబంధించిన కీలక సమీక్ష సమావేశం జరిగింది. పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ కూడా పాల్గొన్నారు. ఈ సమావేశానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు పలువురు మంత్రులు శ్రీధర్ బాబు, కోమటి రెడ్డి వెంకట రెడ్డి, దామోదర రాజనర్సింహా, అడ్లూరి లక్ష్మణ్, అజహరుద్దీన్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, సీతక్క, కొండా సురేఖ, ఉత్తమ్ కుమార్ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ రెండేళ్ల పాలనపై ప్రోగ్రెస్ రిపోర్ట్, పార్టీ ప్రస్తుత పరిస్థితులు, ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలు, భవిష్యత్ కార్యాచరణ వంటి అంశాలపై సమగ్రంగా చర్చ జరిగింది. సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అభినందించారు. ముఖ్యంగా తెలంగాణ మున్సిపల్ ,స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ సాధించిన ఘనవిజయం నేపథ్యంలో ఈ సమీక్ష సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. సమావేశంలో పార్టీ భవిష్యత్ కార్యాచరణపై కీలక నిర్ణయాలు తీసుకున్నామని, ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ కచ్చితంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశానికి సంబంధించిన వివరాలను మల్లికార్జున ఖర్గే తన అధికారిక ఎక్స్ ఖాతాలో వెల్లడించారు. తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ఘనవిజయం సాధించిందని, రాష్ట్ర నాయకులు, మంత్రులతో కలిసి సమగ్ర సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ప్రజల ఆశయాలను నెరవేర్చే దిశగా తదుపరి కార్యాచరణపై చర్చించామని, సామాజిక
సంక్షేమం, ఆర్థిక సాధికారత, అందరికీ న్యాయం అనే లక్ష్యాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ప్రతి పౌరుడి ఆకాంక్షలను సాకారం చేస్తూ సమగ్ర తెలంగాణ నిర్మాణానికి కట్టుబడి ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. సుమారు 2 గంటలపాటు భేటీ కొనసాగింది. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది. సీఎం, మంత్రులు, నాయకులతో సమగ్ర సమీక్ష నిర్వహించాం. సామాజిక సంక్షేమం, ఆర్థిక సాధికారత, అందరికీ న్యాయం చేయడంతో పాటు ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు కట్టుబడి ఉన్నాం. ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నాం అని ఖర్గే పేర్కొన్నారు. ఈ సమావేశంలో మేడారం జాతరను ఘనంగా నిర్వహించినందుకు మంత్రి సీతక్కను కాంగ్రెస్ అగ్రనేతలు అభినందించారు. ఆదివాసీల అతిపెద్ద జాతరగా ప్రసిద్ధి చెందిన మేడారం జాతరపై సుమారు పది నిమిషాల పాటు చర్చ జరిగింది. సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ.. మేడారం జాతర చరిత్ర, ప్రాశస్త్యం గురించి మంత్రి సీతక్కను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమ్మక్క-సారలమ్మల పోరాట గాథను ఖర్గే, రాహుల్ ఆసక్తిగా విన్నారు. సమ్మక్క ? సారలమ్మల చరిత్రను దేశవ్యాప్తంగా చాటేందుకు సినిమా తీయాలని రాహుల్ గాంధీ సూచించారు. పార్టీ సమావేశంలో మంత్రి సీతక్క, రాహుల్ గాంధీ మధ్య సరదా సంభాషణ జరిగింది. మేడారం జాతరకు ఆహ్వానిస్తే తాము తప్పకుండా హాజరయ్యేవారమని రాహుల్ గాంధీ అన్నారు. 'ఆహ్వానిస్తే తాను కూడా తల్లుల దర్శనానికి వచ్చే వాడిని' అని మల్లికార్జున్ ఖర్గే తెలిపారు. అయితే సమయాభావం వల్ల వ్యక్తిగతంగా ఆహ్వానించలేకపోయినట్లు మంత్రి సీతక్క వివరించారు. వచ్చే జాతరకు తప్పకుండా అధికారిక ఆహ్వానం అందిస్తామని సీతక్క అన్నారు. 'ఆహ్వానం అందితే తప్పకుండా వస్తాము' అని రాహుల్ గాంధీ, ఖర్గే హామీ ఇచ్చారు.

# వచ్చే మేలో పార్టీని ప్రకటిస్తా

**ప్రధాన ప్రతిపక్షంగా ఎదుగుతాం**

**అధికారంలోకి రావడం ఖాయం**

**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత**

**హైదరాబాద్,/ఫిబ్రవరి 19 (జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన కొత్త రాజకీయ పార్టీ ప్రకటనకు ముహూర్తం ఖరారు చేశారు. మే నెల మొదటి వారంలో మంచి రోజు చూసుకుని పార్టీని అధికారికంగా ప్రకటిస్తామని ఆమె వెల్లడించారు. పార్టీ పేరులో 'తెలంగాణ' అనే పదం తప్పనిసరిగా ఉంటుందని కవిత స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఎక్కడి నుంచైనా పోటీ చేయవచ్చని అన్నారు. వచ్చే ఎన్నికల్లో తన మొదటి ఛాయిస్ సిద్దిపేట అని, రెండో ఛాయిస్ బోధన్ అని పేర్కొన్నారు. భవిష్యత్తులో




తెలంగాణలో బీజేపీ ఉండదని, ప్రధాన ప్రతిపక్షంగా తామే అవుతామని కవిత ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి తామే వస్తామని, ప్రజల సమస్యలపై పోరాటం చేస్తామని చెప్పారు. ఎంపీటీసీ, జడ్పీటీసీలతో పాటు జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో కూడా పోటీ చేస్తామని ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ దారిలోనే వెళ్తోందని, కొత్త తరహా రాజకీయం చేయడం లేదని విమర్శించారు. తన పార్టీ వ్యక్తుల మీద కాకుండా వ్యవస్థల మీద నడవాలన్నారు. ప్రాంతీయ పార్టీలు లీడర్ సెంట్రిక్‌గా ఉంటాయని.. కానీ వ్యవస్థ నిర్మాణం జరగాలని, సైద్ధాంతిక పునాది ఉండాలని అన్నారు. మహిళలను అవమానించవద్దన్నారు కవిత. వైఎస్ షర్మిలా రెడ్డి నేడు ఏపీలో ఒక జాతీయ పార్టీకి అధ్యక్షురాలిగా ఉన్నారని.. కానీ, షర్మిల తెలంగాణలో పార్టీ పెట్టడం ప్రజలకు నచ్చలేదని తెలిపారు. చిరంజీవి పార్టీ పెట్టి మూసివేయలేదా అని ప్రశ్నించారు. 'నా లైన్‌లో నేను వెళు తున్నా.. నా ప్రయత్నం నాది' అని అన్నారు. తెలంగాణ వాదమే తమ పార్టీ మొదటి లైన్ అని తేల్చిచెప్పారు. ఎన్టీఆర్ పార్టీ పెట్టినప్పుడు కింది స్థాయి నుంచి వచ్చినవారు కేంద్ర మంత్రులు అయ్యారని చెప్పుకొచ్చారు. కొత్త తరానికి తాను పెట్టబోయే పార్టీలో అవకాశాలు ఉంటాయని కవిత పేర్కొన్నారు.

# ఉచిత పథకాలపై సుప్రీంకోర్టు అసహనం..

**(మొదటి పేజి తరువాయి)**
రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటిస్తున్న ఉచిత పథకాలు దేశ ఆర్థిక వృద్ధికి ఆటంకమవుతాయని సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, విపుల్ పంచోలితో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఉచిత ఆహారం, సైకిళ్లు, విద్యుత్తు ఇవ్వడం కన్నా ఉద్యోగాలు, ఉపాధి అవకాశాల సృష్టిపై దృష్టి సారించాలని సూచించింది.
తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వ ఉచిత విద్యుత్తు ప్రకటనపై సర్వోన్నత న్యాయస్థానం సీరియస్‌గా స్పందించింది. వినియోగదారుల ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా రాష్ట్రంలోని అందరికీ ఉచిత విద్యుత్ అందించేలా తమిళనాడు పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ ప్రతిపాదించింది. ఈ నేపథ్యంలో డీఎంకే ప్రభుత్వంపై దాఖలైన పిటిషన్ ను విచారిస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పట్టించుకోకుండా ఉచిత విద్యుత్తును ఎలా అందిస్తారని ప్రశ్నించింది.
చాలా రాష్ట్రాల్లో రెవెన్యూ లోటు పెరుగుతోందని... అయినప్పటికే ఉచిత పథకాల పంపిణీ జరుగుతోందని ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. ఇలాంటి ఉచిత పథకాల వల్ల దేశ అభివృద్ధికి విఘాతం కలుగుతుందని వ్యాఖ్యానించింది. సంక్షేమ పథకాల్లో భాగంగా కరెంట్ బిల్లులు చెల్లించలేని వారికి ఉచిత విద్యుత్ అందిస్తామంటే ఒక అర్థం ఉంటుందని... కానీ, మీరు ఆర్థిక స్థాయితో సంబంధం లేకుండా అందరికీ ఉచిత విద్యుత్ ఇస్తామని చెబుతున్నారని అసహనం వ్యక్తం చేసింది. ఆహారం, విద్యుత్ ఇలా అన్నీ ఫ్రీగా ఇస్తూ... మనం ఎలాంటి సంస్కృతిని అభివృద్ధి చేస్తున్నామని ప్రశ్నించింది. ఎన్నికలకు ముందే రాష్ట్రాలు ఇలాంటి ఉచిత పథకాలను ఎందుకు తీసుకొస్తున్నాయని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఎన్నికల సమయంలో అన్నీ ఉచితంగా ఇచ్చుకుంటూ పోతే... అభివృద్ధి కార్యక్రమాలకు ఒక్క పైసా కూడా మిగలదని వ్యాఖ్యానించింది. ఈ పిటిషన్ పై కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.

# మానవ అభివృద్దిలోఎఐ కీలకం

**(మొదటి పేజి తరువాయి)**
మేకిన్ ఇండియా, భారత ఆవిష్కరణ సామర్థ్యాన్ని ఈ సదస్సు చాటుతోందని పేర్కొన్నారు. ప్రపంచంలో ఆరోవంతు జనాభా భారత్‌లోనే ఉందని, కొత్త సాంకేతికతను అందిపుచ్చుకుంటోందని చెప్పారు. కృత్రిమ మేథను ఉపయోగించుకోవడంలో దేశ యువత ఆసక్తి కనబరుస్తోందని తెలిపారు. భారత్‌లో ఏఐ పురోభివృద్ధి ఒక చరిత్రగా నిలుస్తుందన్నారు. కృత్రిమ మేథకు పరివర్తన శక్తి ఉందని ప్రధాని చెప్పారు. దాన్ని దుర్వినియోగం చేస్తే విధ్వంసానికి దారితీస్తుందని, అదే సద్వినియోగం చేసుకుంటే పరిష్కారాలు చూపుతుందని అన్నారు. మనుషులు, సాంకేతికత కలిసి అభివృద్ధి పయనం సాగించే శకంలో మనం ఉన్నామని తెలిపారు. భవిష్యత్తులో ఏఐ ఏం చేయగలదో కాదు.. ప్రస్తుతం కృత్రిమ మేథను ఉపయోగించి మనం ఏం చేయగలమనేదే అసలు ప్రశ్న అని అన్నారు. ప్రజా సంక్షేమం, శ్రేయస్సే ఏఐకి మన బెంచ్‌మార్క్‌లు అని, మానవ కేంద్రీకృత ఏఐ నిర్మాణం మన లక్ష్యం అవ్వాలని ప్రధాని అన్నారు. కృత్రిమ మేథ మనలను శాసించకూడదని, మనమే ఏఐని శాసించాలని మోదీ చెప్పారు. కృత్రిమ మేథ వినియోగంలో 'మానవ్ విజన్' ఉండాలని ప్రధాని మోదీ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ విజన్ అర్థం, ఫ్రేమ్‌వర్క్ అని ఆయన వివరించారు.

## విశాఖలో వేడుకగా 'ఇంటర్నేషనల్ సిటీ పరేడ్'

**(మొదటి పేజి తరువాయి)**
ఈ భారీ పరేడ్‌లో భాగంగా తొలుత భారత నావికాదళ విమానాలు, హెలికాప్టర్లు గగనతలంలో అబ్బురపరిచే విన్యాసాలు చేశాయి. అనంతరం భారత త్రివిధ దళాలు (ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్), కోస్ట్ గార్డ్ కంటింజెంట్లు కవాతు నిర్వహించాయి. వీరితో పాటు ఫ్రాన్స్, రష్యా, వియత్నాం, థాయ్‌లాండ్, శ్రీలంక సహా పలు మిత్ర దేశాల నావికాదళ సిబ్బంది, వారి సెరిమోనియల్ బ్యాండ్‌లు ప్రదర్శనలో పాల్గొని ఆకట్టుకున్నాయి.
ఈ వేడుకకు ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా హాజరై గౌరవ వందనం స్వీకరించారు. నేవీ కమాండోలు ప్రదర్శించిన సాహస కృత్యాలు, డ్రోన్, లేజర్ షోలు, చివరిలో బాణసంచా వెలుగులు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. వివిధ దేశాల కళాకారులు వారి సంప్రదాయ నృత్యాలతో అలరించారు.
భారత నౌకాదళ శక్తిని ప్రపంచానికి చాటడంతో పాటు, మిత్ర దేశాలతో సముద్ర భద్రతలో సహకారాన్ని, సాంస్కృతిక సంబంధాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ పరేడ్‌ను నిర్వహించారు. ఈ అంతర్జాతీయ వేడుకకు భారీ సంఖ్యలో ప్రజలు తరలిరావడంతో ఆర్కే బీచ్ పరిసరాలు జనసంద్రంగా మారాయి. నిర్వాహకులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

# కర్రెగుట్టల్లో భారీ ఎన్‌కౌంటర్

**(మొదటి పేజి తరువాయి)**
ఆ పార్టీ కార్యదర్శి దేవ్ జీ లక్ష్యంగా కర్రెగుట్టల అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు కూంబింగ్ చేపట్టాయి. కర్రెగుట్టల్లో తలదాచుకున్న మావోయిస్టులు.. ఈ విషయాన్ని గమనించి భద్రతా బలగాలపైకి కాల్పులు జరిపారు. వెంటనే భద్రతా బలగాలు సైతం ఎదురుకాల్పులకు దిగాయి. ఇరువైపులా నుంచీ హోరాహోరీగా కాల్పులు జరిగాయి. కొద్దిసేపటి తర్వాత మావోయిస్టుల వైపు నుంచి కాల్పులు ఆగిపోయాయి. ఆ ప్రాంతంలో ఐదుగురు మావోయిస్టుల మృతదేహాలను భద్రతా బలగాలు గుర్తించాయి. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని భద్రతా బలగాలు వెల్లడించాయి. మృతుల్లో అగ్రనేతలు ఉండవచ్చని భద్రతా దళాలు భావిస్తున్నాయి. మధ్యప్రదేశ్ నుంచి కర్రెగుట్టల్లోకి మావోలు ప్రవేశించారంటూ నిఘా వర్గాలకు సమాచారం అందింది. ఈ నేపథ్యంలో నిఘా వర్గాల సమాచారం మేరకు భద్రతా బలగాలు.. ఈ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టాయి. మరోవైపు దేశంలో మావోయిస్టులను నిర్మూలించేందుకు కేంద్రం చేపట్టిన ఆపరేషన్ కగార్ గడువు మరికొన్ని రోజుల్లో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఆ లక్ష్యం దిశగా కేంద్రం అడుగులు వేస్తోంది. ఇప్పటికే వందలాది మంది మావోయిస్టులు మృతిచెందగా.. వేలాది మంది వివిధ రాష్ట్రాల ప్రభుత్వాల ఎదుట లొంగిపోయారు. పలువురు మావోలను ప్రభుత్వం ఇప్పటికే అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం తెలంగాణకు చెందిన 15మంది మావోయిస్టులు అజ్ఞాతంలో ఉన్నారు. ఆ జాబితాలో రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, మావోయిస్టు కీలక నేత ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి, పుసునూరి నరహరి అలియాస్ సంతోష్, ముప్పిడి సాంబయ్య, వార్త శేఖర్, జోడే రత్నభాయి, బడే చొక్కారావుల కోసం భద్రతా బలగాలు జల్లెడ పడుతున్నాయి. ఇక ఈ రెండేళ్లలో 588 మంది మావోయిస్టులు తెలంగాణ పోలీసుల ముందు లొంగిపోయినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

# నేడు ఢిల్లీకి సీఎం చంద్రబాబు..

ఈ సదస్సులో భాగంగా ఏపీ ప్రభుత్వం పలు చరిత్రాత్మక ఒప్పందాలకు శ్రీకారం చుట్టనుంది. రాష్ట్రంలోని 10 లక్షల మంది యువతకు ఏఐ, క్వాంటం టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ వంటి భవిష్యత్ సాంకేతికతల్లో నైపుణ్యాలు కల్పించేందుకు దిగ్గజ ఐటీ సంస్థ ఐబీఎంతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకోనుంది. అలాగే, ఏఐ, క్వాంటం టెక్నాలజీలలో పరిశోధన, అభివృద్ధిని ప్రోత్సహించేందుకు యూనిసీసీ సంస్థతో కలిసి 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రంలో క్వాంటం ఏఐ యూనివర్సిటీ ఏర్పాటు కోసం ఎన్ఐఈఎల్ఐటీ సంస్థతో, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ట్యూటర్ కోసం ఐఐటీ మద్రాస్‌తోనూ ప్రభుత్వం ఎంఓయూలు చేసుకోనుంది. ప్రముఖ టెక్ సంస్థ ఎన్విడియా భాగస్వామ్యంతో రాష్ట్రంలో ఏఐ లివింగ్ ల్యాబ్స్ ఏర్పాటుపై కూడా ఈ సదస్సులో కీలక ప్రకటన చేయనున్నారు. ఉదయం 9:30 గంటలకు జరిగే ప్లీనరీ సెషన్‌లో అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ, కేంద్ర మంత్రి జితిన్ ప్రసాద, టీసీఎస్ ప్రతినిధులతో కలిసి చంద్రబాబు ప్రసంగిస్తారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు ప్రపంచ ఆర్థిక వేదిక (వరల్డ్ ఎకనామిక్ ఫోరం) నిర్వహించే రౌండ్‌టేబుల్ సమావేశంలో కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్, డబ్ల్యూఈఎఫ్ సీఈఓ బోర్కే బ్రెండేతో కలిసి కృత్రిమ మేధస్సు అంశంపై చర్చిస్తారు. ఈ పర్యటనలో భాగంగా యునైటెడ్ కింగ్‌డమ్ ప్రతినిధి బృందంతో పాటు అరామ్కో, అడోబ్, ఆటోడెస్క్ వంటి కంపెనీల అధిపతులతోనూ ముఖ్యమంత్రి విడివిడిగా సమావేశమై రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడంపై చర్చలు జరుపుతారు.
కాగా, ఢిల్లీ పర్యటనకు ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇవాళ సాయంత్రం జైపూర్ వెళ్లనున్నారు. కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ప్రాజెక్టు డైరెక్టర్, ఐఏఎస్ అధికారి వికాస్ మర్మత్ వివాహ వేడుకకు హాజరై, రాత్రికి అక్కడే బస చేస్తారు. రేపు ఉదయం జైపూర్ నుంచి నేరుగా ఢిల్లీకి చేరుకొని ఏఐ సదస్సులో పాల్గొంటారు.

## సంపూర్ణ ఆరోగ్యము -సానుకూల జీవన విధానం పై

# ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో అవగాహన కార్యక్రమం







### ప్రిన్సిపల్ ప్రొఫెసర్ మల్లం నవీన్

**నర్సంపేట/ఫిబ్రవరి 19 (జర్నలిస్ట్ వార్త):**
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నర్సంపేటలో మహిళా సాధికారిక విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హోలిస్టిక్ వెల్ బీయింగ్ అండ్ న్యూట్రిషన్‌సర్టిఫికెట్ కోర్సు కార్యక్రమంలో భాగంగా " సంపూర్ణ ఆరోగ్యము సానుకూల జీవన విధానం అనే అంశంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ మాట్లాడుతూ ఈ సర్టిఫికెట్ కోర్స్ విద్యార్థుల జీవితాలలో విలువైన మార్పులకు దారితీస్తుందని విద్యతో పాటు జీవన నైపుణ్యాలు కూడా సమానంగా అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ మరియు సామాజిక కార్యకర్త డాక్టర్ అనిత రెడ్డి హాజరై విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు.
డాక్టర్ కే. అనిత రెడ్డి తన ప్రసంగంలో శారీరక ఆరోగ్యం, మానసిక సమతుల్యత, సమతుల ఆహారం, సానుకూల ఆలోచనా విధానం మరియు క్రమబద్ధమైన జీవనశైలి ప్రాముఖ్యతను వివరించారు. నేటి యువత ఒత్తిడులను అధిగమించాలంటే సానుకూల దృక్పథం, సమయపాలన, ధ్యానం, వ్యాయామం వంటి అలవాట్లు పెంపొందించుకోవాలని సూచించారు.
ఆమె మాట్లాడుతూ, “వెల్ బీయింగ్ అంటే కేవలం శారీరక ఆరోగ్యం మాత్రమే కాదు; మానసిక, సామాజిక, భావోద్వేగ సమతుల్యత కూడా అంతే ముఖ్యమైనవి” అని తెలిపారు. విద్యార్థులు తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్ణయించుకుని, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు సానుకూల ఆలోచన ధోరణి అలవరుచుకుని, జీవితంలో విజయాన్ని సాధించవచ్చని ప్రేరణనిచ్చారు.
కళాశాల ప్రిన్సిపాల్ కార్యక్రమానికి అధ్యక్షత వహించి, ఇలాంటి అవగాహన కార్యక్రమాలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారిక విభాగం కన్వీనర్ శ్రీమతి ఎస్ .రజిత మహిళా సాధికారిక విభాగం సభ్యులు శ్రీమతి ఆర్ .రుద్రాణి, డాక్టర్ బి. గాయత్రి , శ్రీమతి ఆర్. మాధవి , దివ్య, స్వప్న , డా. సత్యనారాయణ, శ్రీ రహీముద్దీన్, డా. సోమయ్య, ఇతర అధ్యాపకులు మరియు విద్యార్థినిలు పాల్గొన్నారు.

# వంగర గురుకులంలో సైన్స్ టాలెంట్ టెస్ట్







### ప్రతిభకు ప్రోత్సాహం ట్రస్ట్ సేవలకు ప్రశంసలు

**భీమదేవరపల్లి/ఫిబ్రవరి 19 (జర్నలిస్ట్ వార్త):**
ఫిబ్రవరి 28న జరుపుకునే జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం డాక్టర్ పివి రంగారావు రెసిడెన్షియల్ బాలికల గురుకుల విద్యాలయం, వంగరలో సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. హుజురాబాద్‌కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పరీక్షలో పదవ తరగతి చదువుతున్న 71 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన తొలి పది మంది విద్యార్థినులకు బహుమతులుగా శంకర్ నారాయణ డిక్షనరీలను ట్రస్ట్ నిర్వాహకులు గంగిశెట్టి జగదీశ్వర్, పాఠశాల ప్రిన్సిపాల్ అఫ్రీన్ సుల్తానా మరియు ఉపాధ్యాయుల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అఫ్రీన్ సుల్తానా మాట్లాడుతూ, గత సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా మండల టాపర్ తమ విద్యాలయం నుంచే రావాలని ఆకాంక్షించారు. విద్యార్థినులు కృషి చేసి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచిస్తూ మధురమ్మ ట్రస్ట్ సేవలను అభినందించారు. పరీక్షలో ప్రతిభ చూపిన ఎం. చరణీ, బి. స్వప్నిక, డి. అభిజ్ఞ, జి. అక్షయ, ఎం. రాజలక్ష్మి, బి. అలేఖ్య, ఎం. వైష్ణవి, టి. బిందు శ్రీ, జి. సాయి శ్రీ, ఎస్. సాయి హర్షలను ఉపాధ్యాయ బృందం అభినందించింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# బొల్లోనిపల్లిలో అన్నదమ్ముల మధ్య భూ వివాదం

### రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయిన పరిస్థితి





**భీమదేవరపల్లి/ఫిబ్రవరి 19 (జర్నలిస్ట్ వార్త):** అన్నదమ్ముల మధ్య కొనసాగుతున్న భూ వివాదం కారణంగా రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయిన ఘటన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం బొల్లోనిపల్లి గ్రామంలో ఇద్దరు అన్నదమ్ముల మధ్య భూ వివాదం కొంతకాలంగా కొనసాగుతోంది. పలుమార్లు గ్రామ పెద్దల సమక్షంలో చర్చలు జరిగినప్పటికీ పరిష్కారం కాలేదు. పోలీస్ స్టేషన్‌లో సైతం ఒకరిపై ఒకరు పలు మార్లు ఫిర్యాదులు చేసుకున్నట్లు సమాచారం. ఇటీవల అన్న తన బావి వద్ద బొల్లోనిపల్లి గట్లనర్సింగాపూర్ వెళ్లే రహదారిపై పైప్‌లైన్ ఏర్పాటు కోసం కాలువ తవ్వించాడు. జేసీబీతో పనులు కొనసాగుతున్న సమయంలో పక్కనే ఉన్న తమ్ముని పైప్‌లైన్ దెబ్బతిన్నదని పేర్కొంటూ పనులను అడ్డుకున్నాడు. ఈ క్రమంలో వివాదం మరింత ముదిరి, పెద్దమనుషుల సమక్షంలో సమస్యను తేల్చుకునే వరకు రోడ్డు రాకపోకలు నిలిచే పరిస్థితి నెలకొంది. రహదారిపై తవ్విన గుంత కారణంగా రెండు గ్రామాల మధ్య రవాణా పూర్తిగా స్తంభించింది. దీంతో స్థానికులు, ముఖ్యంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ పనుల కోసం వెళ్లాల్సిన వారు ప్రత్యామ్నాయ మార్గాలు లేక అవస్థలు పడుతున్నారు. అధికారులు వెంటనే జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

# ధర్మసాగర్‌లో శివాజీ శోభాయాత్ర

### నినాదాలతో మార్మోగిన మండల కేంద్రం





**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో ఫిబ్రవరి19: (జర్నలిస్ట్ వార్త):**మండల కేంద్రం గురువారం సాయంత్రం శివభక్తుల నినాదాలతో మార్మోగింది. హిందూ యువ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకుని భారీ ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. ప్రధాన రహదారి వెంబడి శోభాయాత్ర సాగగా, యువత ఉత్సాహంగా పాల్గొని శివాజీ స్ఫూర్తిని చాటారు. అలంకరించిన వాహనాలతో ప్రారంభమైన ర్యాలీ పట్టణంలోని కీలక వీధుల మీదుగా సాగి శివాజీ విగ్రహం వద్ద ముగిసింది. శివాజీ మహారాజ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. కార్యక్రమం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.
ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ శివాజీ మహారాజ్ మహారాష్ట్రలో హిందూ సామ్రాజ్య స్థాపకుడిగా వెలుగొందిన మహావీరుడని పేర్కొన్నారు. 1630 ఫిబ్రవరి 19న శివనేరి కోటలో జన్మించిన ఆయన చిన్ననాటి నుంచే అపార ధైర్యసాహసాలు ప్రదర్శించారని తెలిపారు. తల్లి జిజాబాయి ప్రేరణతో ధర్మనిష్ఠ పాలన సాగించిన శివాజీ, మొఘల్ సామ్రాజ్యానికి సవాల్ విసిరి స్వరాజ్య స్థాపనకు కృషి చేశారని గుర్తుచేశారు.గెరిల్లా యుద్ధ విధానంతో శత్రువులను ఎదుర్కొని చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన శివాజీ, 1674లో రాయగఢ్‌లో రాజ్యాభిషేకం జరుపుకుని ఛత్రపతి బిరుదు పొందారని వివరించారు. ఆయన పాలనలో సైన్యం, నౌకాదళం బలపడి ప్రజాసంక్షేమానికి ప్రాధాన్యం లభించిందని పేర్కొన్నారు.కార్యక్రమంలో స్థానిక నాయకులు, యువకులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# 22న గురుకుల ప్రవేశ పరీక్ష



**రాయపర్తి/ఫిబ్రవరి 19 (జర్నలిస్ట్ వార్త):**
ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో 202627 విద్యా సంవత్సరానికి ఐదవ తరగతి ప్రవేశాలతో పాటు ఆరు నుంచి తొమ్మిదవ తరగతులలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి నిర్వహించే కామన్ ప్రవేశ పరీక్ష ఈ నెల 22న జరగనుంది. ఈ మేరకు రాయపర్తి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకళాశాల ప్రిన్సిపాల్ ఎస్. సరిత గురువారం ప్రకటన విడుదల చేశారు.ఆదివారం ఉదయం 11 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందని, అభ్యర్థులు ఉదయం 10 గంటలలోపు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారంతా తప్పనిసరిగా హాజరుకావాలని స్పష్టం చేశారు.ఫోటో అతికించిన హాల్ టికెట్‌తో పాటు 202526 విద్యా సంవత్సరానికి సంబంధించిన బోనఫైడ్ సర్టిఫికేట్ తీసుకురావాలని తెలిపారు. పరీక్ష హాలులో బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్ మాత్రమే ఉపయోగించాల్సిఉంటుందని, వాటర్ బాటిల్, ఎగ్జామ్ ప్యాడ్ వెంట తీసుకురావచ్చని శ్రీచెప్పారు.నియమ నిబంధనలు కచ్చితంగా పాటిస్తూ సమయపాలనతో పరీక్షకు హాజరుకావాలని ప్రిన్సిపాల్ ఎస్. సరిత సూచించారు.

## ఆరె సంఘం ఆధ్వర్యంలో శివాజీ మహారాజ్ జయంతి



**భీమదేవరపల్లి/ఫిబ్రవరి 19 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని ముత్తారం గ్రామంలో ఆరె సంఘం ఆధ్వర్యంలో శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు శివాజీ మహారాజ్ పోరాటస్ఫూర్తి, ధైర్యసాహసాలు, పరిపాలనా నైపుణ్యాన్ని స్మరించుకున్నారు. యువత శివాజీ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు. రానున్న జయంతి నాటికి గ్రామంలో శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు సంఘ ప్రతినిధులు తెలిపారు. ఇందుకు సంబంధించి అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఊరడి భారతి జైపాల్ రెడ్డి, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు బొక్కల స్రవంతి, ఉప సర్పంచ్ మాట్ల హరికుమార్, ఆరె సంఘం నాయకులు వెనుకమూరి వీరభద్రయ్య, అంభీర్ కవిత, మోకిడి దామోదర్, మోకిడి మోహన్‌రావు, శివాజీ, భరత్, కరట్లపెల్లి వీరభద్రయ్య, స్థానికులు ఏనుగు వెంకట సురేందర్ రెడ్డి, ధర్మారెడ్డి, రాంరెడ్డి, పార్నందుల మహేందర్, హింగె తిరుపతి, మోకిడి లక్ష్మీ, నీల, రజిత తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు




**రాయపర్తి/ఫిబ్రవరి19(జర్నలిస్ట్ వార్త):**మండలంలోని గణేష్ కుంట తండా గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మునావత్ తార్య అనారోగ్యంతో మరణించగా వారి పార్థివ దేహానికి గురువారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హమ్యా నాయక్ పూల మాల వేసి నివాళులు అర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి,టీపీసీసీ మాజీ కార్యదర్శి బిల్లా సుధీర్ రెడ్డి,రెంటాల గోవర్ధన్ రెడ్డి,సర్పంచ్ మునావత్ రఘు,ఉప సర్పంచ్ ఈర,చెవ్వ కాశీనాథం,గ్రామ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్, రవి,భాస్కర్, నేతావత్ అశోక్,రవి మంగు,నరేష్ , అశోక్, వర్ద సుధాకర్,సోమి,తదితరులు పాల్గొన్నారు

## సత్తుపల్లి లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో

# స్మశాన వాటిక శుభ్రతకు శ్రీకారం

### హరితవనంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక సిద్ధం



**సత్తుపల్లి/ఫిబ్రవరి 19 (జర్నలిస్ట్ వార్త):**
సత్తుపల్లి పట్టణ శివారులో ఉన్న హిందూ స్మశాన వాటిక పిచ్చి మొక్కలు, చెత్తాచెదారాలతో అపరిశుభ్రంగా మారింది. దీంతో అంత్యక్రియల కోసం మృతదేహాలను తీసుకువెళ్లే కుటుంబ సభ్యులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రాంగణంలో చెట్లు లేకపోవడంతో ఎండ తీవ్రతలో నిలువ నీడ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.ఈ పరిస్థితిని గమనించిన సత్తుపల్లి లైన్స్ క్లబ్ అధ్యక్షుడు గోగడ రవికుమార్ సమస్య పరిష్కారానికి ముందడుగు వేశారు. వినతిపత్రం ద్వారా స్థానిక సింగరేణి జి.ఎం శ్రీనివాసరావు దృష్టికి విషయం తీసుకెళ్లగా, ఆయన స్పందించి జేసీబీ యంత్రాన్ని సమకూర్చారు.
ఆ యంత్ర సహాయంతో గురువారం స్మశాన వాటికలో పేరుకుపోయిన చెత్త, పిచ్చి మొక్కలను తొలగించి ప్రాంగణాన్ని శుభ్రపరిచారు.సుమారు ఏడు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ స్మశాన వాటికను పచ్చని హరితవనంగా మార్చేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు లైన్స్ క్లబ్ నిర్వాహకులు మందపాటి ప్రభాకర్ రెడ్డి, గోగడ రవికుమార్, రావి నాగేశ్వరరావు తెలిపారు. త్వరలోనే విస్తృతంగా మొక్కలు నాటి, నీడ కలిగించే చెట్లతో ప్రాంగణాన్ని ఆహ్లాదకర వాతావరణంగా తీర్చిదిద్దుతామని వారు వెల్లడించారు.

# అడ్డగోలు పాటలతో బాబును బద్నాం చేస్తున్నారంటూ ఆగ్రహం

### బీఆర్ఎస్ యూట్యూబ్ ఛానల్‌పై ఫిర్యాదు..

### చర్యలు తీసుకోకపోతే ఆందోళన హెచ్చరిక



**ఖమ్మం /ఫిబ్రవరి19 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ ఉద్యమాన్ని అణిచివేసే ప్రయత్నం చేశారంటూ యూట్యూబ్‌లో ప్రసారమైన ఓ పాటపై మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నారా చంద్రబాబు నాయుడుపై కించపరిచేలా రూపొందించిన ఆ పాటను వెంటనే తొలగించి, సంబంధితులపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు మద్దతుగా కేంద్రానికి లేఖ రాసి తన వంతు సహకారం అందించిన నాయకుడిని ఉద్దేశపూర్వకంగా లక్ష్యంగా చేసుకుని దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. భారత రాష్ట్ర సమితికు అనుబంధంగా నడుస్తున్న యూట్యూబ్ ఛానల్‌లో "పెద్దాయన" పేరుతో విడుదలైన పాటలో చంద్రబాబు నాయుడు హయాంలో తెలంగాణ ఉద్యమాన్ని అణిచివేసినట్టు, ఉద్యమకారులను హింసించినట్టు భావం వచ్చేలా పదాలు ఉపయోగించారని పేర్కొన్నారు. పాటకు ఆయన ఫోటోను జతచేయడం మరింత అభ్యంతరకరమని అన్నారు. ఈ మేరకు బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సైబర్ క్రైమ్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వ్యక్తిత్వాన్ని, రాజకీయ ప్రస్థానాన్ని దెబ్బతీసేలా అసత్య ఆరోపణలు చేయడం తగదని, ఇది రాజకీయ సంస్కృతికి విరుద్ధమని మండిపడ్డారు. తమ పార్టీ నాయకుల గొప్పతనాన్ని చాటుకునే క్రమంలో సీనియర్ నేతపై విషప్రచారం చేయడం సమంజసం కాదన్నారు. సంబంధిత యూట్యూబ్ నిర్వాహకులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, లేకపోతే తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టక తప్పదని హెచ్చరించారు

## సుందరరావు పెద్దకర్మలో డాక్టర్ వాసిరెడ్డి నివాళులు



**ఖమ్మం/ఫిబ్రవరి 19 (జర్నలిస్ట్ వార్త):** ఆంధ్ర ప్రదేశ్ ఎన్టీఆర్ జిల్లా, పెనుగంచిప్రోలు మండలం శివాపురం గ్రామానికి చెందిన సుపరిచిత వామపక్ష మిత్రుడు, తెలుగుదేశం పార్టీ నాయకుడు చెరుకూరి సుందరరావు (80) పెద్దకర్మ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, సుందరరావు చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం కుటుంబ సభ్యులను, బంధుమిత్రులను పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. సుందరరావు గ్రామ రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించి, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేసిన వ్యక్తిగా గుర్తింపు పొందారని నాయకులు పేర్కొన్నారు. ఆయన సేవలను స్మరించుకుంటూ పలువురు నేతలు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ం

## నూతనకల్లులో విద్యార్థులకు పెన్నులు, గైడ్ల పంపిణీ



**తల్లాడ/ఫిబ్రవరి 19 (జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండలంలోని నూతనకల్లు గ్రామ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పెన్నులు, ముఖ్యమైన గైడ్లను పంపిణీ చేశారు. ఖమ్మం జిల్లా యువనాయకుడు అడపా అనిల్ చౌదరి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర నాయకుడి పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, గైడ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి శాతం వంద ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. మంచి విద్యతోనే భవిష్యత్తు వుతుందని తెలిపారు.

కార్యక్రమంలో నూతనకల్లు గ్రామ అధ్యక్షురాలు తెలపూట శ్రీదేవి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, గ్రామ నాయకులు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.ం

## సనాతన ధర్మాన్ని కాపాడిన మహనీయుడు చత్రపతి శివాజీ

### ..సర్పంచ్ సంతోషి మల్లారెడ్డి



**స్టేషన్ ఘన్ పూర్/ ఫిబ్రవరి19 (జర్నలిస్ట్ వార్త) :** సనాతన ధర్మాన్ని రూపుమాపాలని చూసిన మతోన్మాదులను తరిమి కొట్టిన మహనీయుడు చత్రపతి శివాజీ అని సర్పంచ్ సంతోషి మల్లారెడ్డి అన్నారు. చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా మండలంలోని బండ్లగూడ గ్రామంలో చత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరైమాట్లాడుతూ హిందుత్వాన్ని కల రాయాలని చూసిన వారిని చీల్చి చెండాడి శివాజీ భావితరాలకు ఆదర్శంగా నిలిచారన్నారు. నేటి సమాజంలో యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విగ్రహ ఏర్పాటు కోసం మడికొండ సమత శ్రీధర్ రెడ్డి రెండు లక్షలు, పోరెడ్డి సంతోషమల్లారెడ్డి 25 వేలతో తో పాటు మరికొంతమంది దాతలు విరాళం అందజేసి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో చిట్టి పల్లి దయాకర్ రెడ్డి, చల్ల లక్ష్మారెడ్డి, రవీందర్ రెడ్డి,కుమారస్వామి, భూపాల్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, సందీప్ రెడ్డి, స్వామి యాదవ్, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఏఎల్ఎంఎస్‌సీ నూతన కమిటీ ఏర్పాటు

### చైర్మన్‌గా 20వ వార్డు కౌన్సిలర్ శ్రీరామోజు రోజా రాణి ఎంపిక






**నర్సంపేట/ఫిబ్రవరి 19 (జర్నలిస్ట్ వార్త):** నర్సంపేట పట్టణంలోని నాలుగో అంగన్వాడీ కేంద్రంలో గురువారం సమావేశం నిర్వహించి ఏఎల్ఎంఎస్‌సీ నూతన కమిటీని ఏర్పాటు చేశారు. మున్సిపల్ ఎన్నికల అనంతరం అంగన్వాడీ కేంద్ర పరిధిలోని 20వ వార్డు కౌన్సిలర్‌గా ఎన్నికైన శ్రీరామోజు రోజా రాణిని కమిటీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆమె అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్ర అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, ఆదర్శవంతమైన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఎల్లప్పుడూ సహకారం అందిస్తానని తెలిపారు.

స్థానిక పర్యవేక్షకురాలు రమ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్ర నిర్వహణలో ఏఎల్ఎంఎస్‌సీ కమిటీ పూర్తి సహకారం అందించాలని కోరారు. గర్భిణీలు, బాలింతలు, పూర్వ ప్రాథమిక విద్యార్థులు క్రమం తప్పకుండా కేంద్రానికి హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అంగన్వాడీ ఉపాధ్యాయురాలు నల్ల భారతి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభ మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాల ఆవరణలో రెండు గదులే ఉండటంతో అంగన్వాడీ కేంద్రం, పాఠశాలకు మౌలిక వసతుల సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. కౌన్సిలర్ చొరవ తీసుకుని నూతన భవనం నిర్మాణానికి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ శ్రీరామోజు రోజా రాణి, పర్యవేక్షకురాలు రమ, అంగన్వాడీ ఉపాధ్యాయురాలు నల్ల భారతి, గౌసియా, ఆయా సునీత, ప్రధానోపాధ్యాయురాలు శోభ, పెరుక కరుణ, మర్రి రాధిక, కొలిపాక రాజమణి, చంకేశ అనిత, గూడూరు రమ్య, చామంతుల మానస, వేల్పుల రజిత, ఆశ రమాదేవి, ఇమ్మడి మంజుల, గడ్డం భవాని, దామెర వజ్రమ్మ, స్వాతి ఉష తదితర తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

## సత్తుపల్లిలో ఘనంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు

### భారీ బైక్ ర్యాలీతో మారుమోగిన పట్టణం





**సత్తుపల్లి/ఫిబ్రవరి 19 (జర్నలిస్ట్ వార్త):** ఖమ్మం జిల్లా సత్తుపల్లి పట్టణంలో హిందూ సామ్రాజ్య స్థాపకుడు, మహా వీరుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని యువత, శివాజీ సేన బాధ్యులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సాహంగా పాల్గొన్నారు. జయంతి సందర్భంగా ముందుగా పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. శివాజీ మహారాజ్ చిత్రాలతో, కాషాయ జెండాలతో అలంకరించిన వాహనాలతో ర్యాలీ ఉత్సాహభరితంగా సాగింది. "ఛత్రపతి శివాజీ మహారాజ్ కి జై" నినాదాలతో సత్తుపల్లి మారుమోగింది. ప్రధాన వీధుల మీదుగా కొనసాగిన ఈ ర్యాలీ ప్రజల్లో దేశభక్తి, ధైర్యసాహసాలు, స్వాభిమానం పట్ల అవగాహన కల్పించింది.

అనంతరం బోసు బొమ్మ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన శివాజీ మహారాజ్ చిత్రపటానికి శివాజీ సేన బాధ్యులు పాలాభిషేకం నిర్వహించారు. పుష్పాంజలి ఘటించి మహారాజ్ సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ, శివాజీ మహారాజ్ పరాక్రమం, పరిపాలనా నైపుణ్యం, ధర్మ పరిరక్షణలో ఆయన పాత్రను విశదీకరించారు. యువత శివాజీ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో స్థానిక నాయకులు, సామాజిక కార్యకర్తలు, యువకులు, మహిళలు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. మొత్తం కార్యక్రమం శాంతియుత వాతావరణంలో ఉత్సాహంగా సాగింది.

# శాస్త్రీయ దృక్పథమే సమాజానికి దిక్సూచి

### సైన్స్ మంత్‌లో విద్యార్థుల్లో చైతన్యం నింపిన జన విజ్ఞాన వేదిక





**ధర్మసాగర్ /హనుమకొండ బ్యూరో ఫిబ్రవరి 19 (జర్నలిస్ట్ వార్త)**మూఢనమ్మకాల కమ్ముకున్న సమాజానికి శాస్త్రీయ దృక్పథమే వెలుగునిస్తుందని వక్తలు స్పష్టం చేశారు. సైన్స్ మంత్ కార్యక్రమాల భాగంగా జన విజ్ఞాన వేదిక హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం పలు పాఠశాలల్లో శాస్త్రీయ సదస్సులు ఘనంగా నిర్వహించారు. సెయింట్ మ్యాథ్యూస్ హై స్కూల్, జెడ్పిహెచ్ఎస్ గర్ల్స్ ధర్మసాగర్, బాలజ్యోతి హై స్కూల్లలో జరిగిన ఈ కార్యక్రమాలు విద్యార్థుల్లో విశేష స్పందన రేపాయి. "శాస్త్రీయ దృక్పథం విమర్శనాత్మక ఆలోచన ప్రాముఖ్యత" అనే అంశంపై నిర్వహించిన సెమినార్లు ఆలోచింపజేసేలా సాగాయి. రాష్ట్ర పర్యావరణ ఉపసంఘ కన్వీనర్ కే.బి. ధర్మ ప్రకాశ్ ముఖ్యోపన్యాసం అందిస్తూ, శాస్త్రం అనేది పుస్తకాలకే పరిమితం కాదని, దైనందిన జీవితంలో ప్రతి నిర్ణయంలో తర్కబద్ధ ఆలోచన అవసరమని పేర్కొన్నారు. చార్ల్స్ డార్విన్ పరిణామ సిద్ధాంతం, నికోలస్ కోపర్నికస్ సూర్యకేంద్ర సిద్ధాంతం, సత్యాన్వేషణలో ప్రాణత్యాగం చేసిన జియోర్డానో బ్రూనో త్యాగం వంటి చారిత్రక ఘట్టాలను ఉదాహరణగా ప్రస్తావిస్తూ శాస్త్రవేత్తల ధైర్యసాహసాలను గుర్తుచేశారు. ప్రశ్నించడం, విశ్లేషించడం, ఆధారాలతో ఆలోచించడం విద్యార్థుల లక్షణాలుగా మారాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో విద్యార్థులు చురుకుగా పాల్గొని సందేహాలను వ్యక్తం చేయడం విశేషం. పరస్పర చర్చలతో సదస్సులు సజీవంగా మారాయి.

యువతలో శాస్త్రీయ దృక్పథం, విమర్శనాత్మక ఆలోచన, ఆధారాధిష్ఠిత తర్కాన్ని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు కొనసాగిస్తామని జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు తెలిపారు.

# యువకుడి మృతితో గణపురం గుండె పగిలింది

## రోడ్డు ప్రమాదంలో శ్రీకాంత్ దుర్మరణం

### దారిపొడవునా పాలాభిషేకాలు.. కడసారి వీడ్కోలులో గ్రామం కంటతడి





**గణపూర్/ ఫిబ్రవరి 19 (జర్నలిస్ట్ వార్త):** యువకుడి అకాల మరణం గణపురం మండలాన్ని శోకసంద్రంలో ముంచేసింది. రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన రెబ్బ శ్రీకాంత్ (26)కు గురువారం గ్రామం ఘనంగా అంత్యక్రియలు నిర్వహించింది. గ్రామమంతా ఒక్కటై కడసారి వీడ్కోలు పలికింది.

బుధవారం సాయంత్రం కమలాపూర్ క్రాస్ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో గణపురంకు చెందిన శ్రీకాంత్, నర్సింగాపూర్ గ్రామానికి చెందిన గాదే మహేష్ మృతిచెందారు. ప్రమాద వార్త తెలిసిన క్షణం నుంచి గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది.

గురువారం ఉదయం భూపాలపల్లిలోని వందపడకల ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు. అంగడి ప్రాంతం నుంచి భారీ ఊరేగింపుగా ఇంటివరకు తీసుకువచ్చారు. డీజే పాటలు, డప్పు సప్పుళ్ల మధ్య యువకుడికి కడసారి నివాళులు అర్పించారు. దారిపొడవునా శ్రీకాంత్ చిత్రపటానికి పాలాభిషేకాలు నిర్వహించారు.

ఇటీవలే పెళ్లి చేసుకున్న శ్రీకాంత్ మృతి తల్లిదండ్రులు ప్రసాద్, నాగమణిని తీవ్ర విషాదంలోకి నెట్టింది. "మాకు ఇప్పుడు ఎవరు దిక్కు?" అంటూ వారు విలపించడంతో అక్కడున్న వారంతా కంటతడి పెట్టారు. బుధవారం రాత్రి నుంచే స్నేహితులు ఆసుపత్రి వద్ద ఉండి అన్ని కార్యక్రమాలను సమన్వయం చేశారు.

**మాజీ జెడ్పిటిసి భావోద్వేగం**

మాజీ జెడ్పిటిసి మోటపోతుల శివశంకర్ గౌడ్ ప్రమాద వార్త తెలుసుకున్న వెంటనే ఆసుపత్రికి చేరుకుని పోస్టుమార్టం, పంచనామా కార్యక్రమాలను పర్యవేక్షించారు. అంత్యక్రియలలో స్వయంగా పాల్గొని కుటుంబ సభ్యులను ఓదార్చారు. పాడె మోసిన సమయంలో ఆయన కన్నీరు పెట్టుకోవడంతో అక్కడి వాతావరణం మరింత హృదయ విదారకంగా మారింది.

**వ్యాపారుల స్వచ్ఛంద బంద్**

యువకుడి అకాల మరణంతో గణపురం మండలం శోకసంద్రంగా మారింది. మండల కేంద్రంలోని వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేసి అంత్యక్రియలకు హాజరయ్యారు. గ్రామం మొత్తం ఒక్కటై శ్రీకాంత్‌కు కన్నీటి వీడ్కోలు పలికింది.

# ఆరోపణలు నిరూపించే దమ్ముందా?

## కాంగ్రెస్ నేతలకు బీఆర్ఎస్ సవాల్



**వర్ధన్నపేట/ఫిబ్రవరి 19(జర్నలిస్ట్ వార్త):** కాంగ్రెస్ నాయకులు తమ రాజకీయ ఉనికి కోసం చేస్తున్న చౌకబారు విమర్శలను, అసత్యపు ఆరోపణలను వెంటనే మానుకోవాలని బీఆర్ఎస్ శ్రేణులు హెచ్చరించాయి. గురువారం వర్ధన్నపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో పార్టీ నాయకులు మాట్లాడుతూ అధికార పార్టీ వైఖరిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మానాయకుడిపై 2,000 ఎకరాల భూకబ్జా అంటూ పనికిమాలిన ఆరోపణలు చేస్తున్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉండి రెండున్నర ఏళ్లు దాటుతోంది, మరి దమ్ముంటే ఆ ఆరోపణలను నిరూపించి చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు? అని వారు ప్రశ్నించారు. కేవలం బురదజల్లడమే లక్ష్యంగా కాంగ్రెస్ నేతలు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రజలకు సేవలను చేరువ చేసేందుకు గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన గెస్ట్ హౌస్‌లు ప్రజా కార్యాలయాలు అని బీఆర్ఎస్ నేతలు స్పష్టం చేశారు. అప్పట్లో అవే ఆఫీసుల నుంచి సీఎంఆర్ఎఫ్, కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేసినప్పుడు మీరు ఏ పార్టీలో ఉన్నారో మర్చిపోయారా? అని ఎద్దేవా చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండే ఆఫీసులపై విషప్రచారం చేయడం మీ అజ్ఞానానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. అక్రమ మార్గాల్లో పదవులు దక్కించుకుని, ఇప్పుడు స్థాయి మర్చిపోయి సీనియర్ నాయకులను విమర్శిస్తే కార్యకర్తలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. విమర్శలు మానుకోకపోతే ప్రజల పక్షాన తగిన బుద్ధి చెప్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట పట్టణ అధ్యక్షులు గోధుమల మధుసూదన్, మండల పార్టీ అధ్యక్షులు తూళ్ల కుమారస్వామి, మాజీ జెడ్పిటిసి మార్గం బిక్షపతి, కౌన్సిలర్లు సిల్వర్ కుమార్ స్వామి, గుజ్జ వీరన్న, తుమ్మల అరుణ శ్రీధర్, బాణోతు జ్యోతి నవీన్, తుమ్మల యాకయ్య, మాజీ కౌన్సిలర్ రవీందర్, నాయకులు కొండేటి శ్రీనివాస్, సంపత్, సుధాకర్, రాములు, రాజు, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

# తల్లాడలో ఎన్టీఆర్ విగ్రహాల ఆవిష్కరణకు ఘన ఏర్పాట్లు



**తల్లాడ/ఫిబ్రవరి 19 (జర్నలిస్ట్ వార్త):** మండల కేంద్రం తల్లాడలో తెలుగువారి ఆత్మగౌరవ ప్రతీక, స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహాల ఆవిష్కరణకు ఏర్పాట్లు జోరందుకున్నాయి. రింగ్‌రోడ్ సెంటర్‌తో పాటు బిల్లుపాడు జెకె నగర్ సెంటర్‌లో విగ్రహాలను ప్రతిష్ఠించి అంగరంగ వైభవంగా ఆవిష్కరించనున్నట్లు తల్లాడ మండల కమిటీ అధ్యక్షుడు సరికొండ శ్రీనివాసరాజు తెలిపారు.

తెలుగు జాతి గర్వకారణమైన ఎన్టీఆర్ రాజకీయాల్లో తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచ వేదికపై నిలబెట్టిన మహానేత అని కొనియాడారు. ఆయన ఆలోచనలు, సంకల్పం నేటి తరాలకు దిశానిర్దేశం చేస్తున్నాయని పేర్కొన్నారు. ఎన్టీఆర్ సేవలను స్మరించుకుంటూ విగ్రహాల ఆవిష్కరణను ప్రజాస్వామ్య పండుగలా నిర్వహించేందుకు అన్ని వర్గాల ప్రజలను భాగస్వాములుగా చేసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో కొమ్మినేని రామయ్య, కేతినేని హరీష్, ధూపాటి భద్రరాజు, రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు కూచిపూడి వెంకటేశ్వరరావు, రాయల తిరుమలయ్య, నున్న రామారావు, ఎండి బాబు, దోనేశు, పరుచూరి కృష్ణ, దగ్గుల శ్రీనివాస్‌రెడ్డి, సంఘసాని శ్రీను, నాగరాజు, కన్నేటి పృథ్వి, నాగండ్ల లక్ష్మణ్, జక్కంపూడి రామాంజనేయ, మాజీ ఎంపీటీసీ బత్తుల రాందాస్, వేలపోలు కృష్ణ, నరపోగు ప్రసాద్‌బాబు, వేముల గోవిందు, సతీష్, బత్తుల అర్జున్‌రావు, శరత్, రమేష్, ఎల్లయ్య, లాలయ్య, సీతయ్య, అంబడిపూడి లెనిన్ తదితరులు పాల్గొన్నారు. విగ్రహాల ఆవిష్కరణ తేదీని త్వరలో ప్రకటించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# పేదోడి కల నెరవేర్చేది ఇందిరమ్మ రాజ్యంలోనే...!

**ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య.**





**బయ్యారం/ ఫిబ్రవరి 19(జర్నలిస్ట్ వార్త):** మండలంలో ఇందిరమ్మ రాజ్యంలోనే పేదోడి కల సహకారం అవుతుందని ,ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య అన్నారు. మండలంలోని కొత్తపేట గ్రామపంచాయతీ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల సమావేశంను ఎంపీడీవో దీపిక అధ్యక్షతన గురువారం సమావేశమును ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఇల్లందు శాసనసభ్యులు పాల్గొని మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలనలో మొదటి విడత ఇందిరమ్మ ఇండ్ల కార్యక్రమంలో భాగంగా మండలానికి 555 డబల్ బెడ్ రూమ్ ఇండ్లను లబ్ధిదారులకు మంజూరు చేయడం జరిగిందని అన్నారు . ప్రతి ఇంటికి 4 విడతల్లో భాగంగా ఐదు లక్షల రూపాయలు ప్రభుత్వం నుండి మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను ఇందిరమ్మ ఇండ్ల విషయంపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు గత ప్రభుత్వంలో పేదలకు ఇండ్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేశారని, ఇందిరమ్మ రాజ్యంలో ఇల్లు ఇవ్వడం వల్ల పేదోళ్లకి పండగ వాతావరణంగా నెలకొందని, సంతోషం వ్యక్తం చేశారు. ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. ఇల్లు ఇచ్చిన ఎమ్మెల్యేకు ప్రజాప్రతినిధులకు లబ్ధిదారులు కృతజ్ఞతలు అభినందనలు తెలిపారు.

### ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలకు ప్రారంభోత్సవం చేసిన ఎమ్మెల్యే

మండలంలో కొత్తపేట బయ్యారం గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు నిర్మాణం పూర్తయిన ఇండ్లకు గృహప్రవేశం ప్రారంభోత్సవాలు ఎమ్మెల్యే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ నాగరాజు, కొత్తపేట సర్పంచ్ భూక్యా ప్రవీణ్ నాయక్ ,మాజీ సొసైటీ చైర్మన్ మూల మధుకర్ రెడ్డి, మండలంలోని పలు గ్రామపంచాయతీ సర్పంచులు, సీఐ రవీందర్, ఎస్సై తిరుపతి, కొత్తపేట, బయ్యారం పంచాయతీ కార్యదర్శులు అలీ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# 26 నుంచి తెలంగాణ బడ్జెట్ సమావేశాలు

## తొలిరోజు వర్నర్ ప్రసంగంతో ప్రారంభం

## 28న బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న భట్టి

**హైదరాబాద్,/ఫిబ్రవరి 19 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ అసెంబ్లీ బ్జడెట్ సమావేశాల తేదీ ఖరారైంది. ఈనెల 26 నుంచి శాసనసభ సమావేశాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మొదటి రోజు ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రసంగించనున్నారు. మరుసటి రోజు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరుగనుంది. ఫిబ్రవరి 28న అసెంబ్లీలో 2026–27 ఆర్థిక సంవత్సరానికి గాను బడ్జెట్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. సారి సభను 10 నుంచి 15 రోజులపాటు నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. బడ్జెట్ రూపకల్పనపై సర్కార్ కసరత్తు ముమ్మరం చేసింది. ఇప్పటికే ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలో శాఖల వారీగా ప్రీ బ్జడెట్ సమావేశాలను పూర్తి చేశారు. అన్ని శాఖల మంత్రులు, అధికారులతో మంత్రి భట్టి విక్రమార్క సమీక్షలు నిర్వహించారు. ఈసారి బ్జడెట్‌లో సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేయనున్నట్లు తెలుస్తోంది. రైతు సంక్షేమం, మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి వంటి ఆరు గ్యారంటీల అమలుకు భారీగా నిధులు కేటాయించే అవకాశం ఉంది. కొత్త సంక్షేమ పథకాలు, నీటిపారుదల, మౌలిక సదుపాయాలు, పట్టణాభివృద్ధి వంటి అంశాలపైనా ప్రభుత్వం దృష్టి సారించనుంది. ఈసారి అసెంబ్లీ సమావేశాల్లో పెన్షన్ల విషయంలో కీలక నిర్ణయాన్ని ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. ఇక, ఈనెల 23న సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరుగనుంది. ఈ కేబినెట్‌లో బ్జడెట్ సమావేశాలపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

# ప్రాణాపాయంలో పూస సతీష్..

## ఆదుకోవాలని చిన్నారి బిడ్డల వేడుకోలు





**రాయపర్తి/ఫిబ్రవరి 19(జర్నలిస్ట్ వార్త):** విధి ఆడిన వింత నాటకంలో ఒక పేద కుటుంబం రోడ్డున పడింది. రెక్కాడితే గానీ డొక్కాడని ఆ కుటుంబంలో ఇంటి యజమాని ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతుంటే, భార్యాబిడ్డలు కన్నీరుమున్నీరవుతున్నారు. వివరాల్లోకి వెళ్తే వరంగల్ జిల్లా రాయపర్తి మండలం, గ్రామ నివాసి అయిన పూస సతీష్ (35) తండ్రి కుమారస్వామి, రెండు రోజుల క్రితం పని నిమిత్తం తన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఘోర రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఎదురుగా వచ్చిన వాహనం బలంగా ఢీకొట్టడంతో సతీష్ తలకు తీవ్రమైన గాయమైంది. వెంటనే అతడిని హనుమకొండలోని గార్డియన్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో, వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఏ ఐ జీ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయనకు అత్యవసరంగా బ్రెయిన్ సర్జరీ చేయాల్సి ఉందని, అందుకు సుమారు 30 లక్షల రూపాయల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు వెల్లడించారు.

**దిక్కుతోచని స్థితిలో కుటుంబం..**

సతీష్ అత్యంత నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తి. ఆయనకు భార్య, ముక్కుపచ్చలారని ఇద్దరు ఆడపిల్లలు 3 ఏళ్లు, ఒక ఏడాది వయసు ఉన్నారు. ఇంటి పెద్ద దిక్కు ఆసుపత్రి పాలవ్వడంతో ఆ కుటుంబం ఆర్థికంగా చితికిపోయింది. అంత పెద్ద మొత్తంలో వైద్య ఖర్చులు భరించడం ఆ పేద కుటుంబం వల్ల కావడం లేదు.

**దాతల పన్నహస్తం కోసం ఎదురుచూపులు...**

తమ ఇంటి యజమానిని కాపాడుకోవడానికి ఆ కుటుంబం దాతల సాయం కోసం ఎదురుచూస్తోంది. మానవతా దృక్పథంతో స్పందించి, తలో చేయి వేసి సతీష్ ప్రాణాలను నిలబెట్టాలని గ్రామస్తులు, కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు.

సహాయం చేయాలనుకునే వారు ఈ క్రింది నంబర్లకు పంపగలరు.

**పూస సతీష్ ,సెల్ నంబర్: 9912552897**

**పూస చంటి (ఫోన్ పే/ జీ పే): 6300370245**

మీరు చేసే చిన్న సాయం ఒక నిండు ప్రాణాన్ని కాపాడటమే కాకుండా, ఇద్దరు చిన్నారి ఆడపిల్లల భవిష్యత్తుకు భరోసానిస్తుంది.

# కాలం కదిలే పాఠశాల..

# నేర్చుకున్నవారికి పూలమాల

**ప్రపంచంలో అన్నీ ఆగిపోతాయేమో కానీ, కాలం మాత్రం ఆగదు. అది నిరంతరాయంగా సాగే ఒక ప్రవాహం. ఆ ప్రవాహంలో ప్రతి క్షణం ఒక పాఠమే, ప్రతి అనుభవం ఒక గుణపాఠమే. అందుకే పెద్దలు అంటారు.కాలం కదిలే పాఠశాల అని. ఆ పాఠశాలలో చేరడానికి వయసుతో నిమిత్తం లేదు, రుసుము చెల్లించక్కర్లేదు,కావాల్సిందల్లా కేవలం గమనించే కన్ను, గ్రహించే మనసు.**



సీనియర్ జర్నలిస్ట్ బిర్రు కరుణాకర్.
సెల్ నంబర్ 9701249103

### నిత్యం కొత్త పాఠం

సృష్టిలో ప్రతి జీవి కాలంతో పాటే ప్రయాణిస్తుంది. ఉదయించే సూర్యుడు క్రమశిక్షణను నేర్పితే, రాలే ఆకు వినయాన్ని బోధిస్తుంది. నిన్నటి వైఫల్యం నేటి విజయానికి పునాది కావాలని కాలం హెచ్చరిస్తుంటుంది. మనం చేసే తప్పులే మనకు గొప్ప గురువులు. అయితే, ఆ తప్పుల నుంచి పాఠం నేర్చుకుని ముందుకు సాగడమే విజ్ఞత. గడిచిన కాలాన్ని తలచుకుని కుమిలిపోవడం కంటే, రాబోయే కాలాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలో ఆలోచించడమే అసలైన విద్య.

### అనుభవాల సారం

జీవితం అంటేనే గెలుపోటముల సమ్మేళనం. కాలం మనకు ఎప్పుడూ తీపి కబుర్లే చెప్పదు; ఒక్కోసారి చేదు నిజాలను కూడా రుచి చూపిస్తుంది. ఓటమి ఎదురైనప్పుడు కుంగిపోకుండా, అది మనకు ఏ పాఠం నేర్పిందో విశ్లేషించుకోవాలి. కాలం విలువ తెలిసిన వాడు లోకాన్ని శాసిస్తాడు. విత్తనం నాటిన వెంటనే ఫలం రాదు, కాలం పక్వానికి రావాలి. మారుతున్న కాలంతో పాటు మనం మారకపోతే, కాలగర్భంలో కలిసిపోతాం.

కాలం అనే పాఠశాలలో మనం నిత్య విద్యార్థులం. ఇక్కడ పరీక్షలు ముందు జరిగి, పాఠాలు తర్వాత అర్థమవుతుంటాయి. జరిగిన పొరపాట్లను దిద్దుకుంటూ, నేర్చుకున్న పాఠాలను భవిష్యత్తుకు మార్గదర్శకాలుగా మార్చుకున్నప్పుడే మానవ జన్మ సార్థకమవుతుంది. కాలం మనకిచ్చే అతిపెద్ద కానుక అనుభవం ఆ అనుభవాన్ని ఆయుధంగా చేసుకుని, నిరంతర అభ్యాసకుడిగా సాగిపోవడమే విజయానికి రాజమార్గం. లక్ష్య సాధకులకు కాలం ఇచ్చే సందేశం విద్యార్థులకు దిక్సూచినేటి విద్యార్థే రేపటి పౌరుడు. పాఠశాల గదుల్లో నేర్చుకునే అక్షరాలు కేవలం జ్ఞానాన్ని ఇస్తే, కాలం నేర్పే పాఠాలు జీవితాన్ని ఎలా జీవించాలో నేర్పుతాయి. పరీక్షల్లో వచ్చే మార్కులు కేవలం మీ తెలివితేటలకు కొలమానం కావు, ఆ సమయాన్ని మీరు ఎంత క్రమశిక్షణతో వాడుకున్నారనే దానికి నిదర్శనం. ఒకసారి మార్కులు తక్కువ వచ్చాయని కుంగిపోకూడదు. కాలం మీకు మరో అవకాశాన్ని ఇస్తుంది. ఆ విరామాన్ని విశ్రాంతి గా కాకుండా, లోపాలను సరిదిద్దుకునే సన్నాహక సమయంగా మార్చుకోవాలి. మారుతున్న కాలంతో పాటు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి, కానీ దానికి బానిసలై అమూల్యమైన కాలాన్ని సామాజిక మాధ్యమాల్లో వృథా చేయకూడదు.

కెరీర్ రేసులో పరిగెడుతున్న వృత్తి నిపుణులకు కాలం ఒక కఠినమైన యజమాని, అలాగే గొప్ప మార్గదర్శి. నిరంతర అభ్యాసం చదువు పూర్తయింది, ఇక నేర్చుకోవడానికి ఏమీ లేదు అనుకోవడం వృత్తిపరంగా తిరోగమనమే. కాలం ప్రవహిస్తున్న కొద్దీ కొత్త నైపుణ్యాలు పుట్టుకొస్తూనే ఉంటాయి. అప్-డేట్ అవ్వని వాడు అవుట్-డేట్ అయిపోతాడు. పని ఒత్తిడిలో పడి కాలాన్ని కేవలం సంపాదనకే పరిమితం చేయకండి. కుటుంబానికి, ఆరోగ్యానికి సమయం కేటాయించకపోతే, భవిష్యత్తులో కాలం మీకు అనారోగ్యం అనే చేదు పాఠాన్ని నేర్పిస్తుంది.

సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకోవడమే నాయకత్వ లక్షణం. కాలం ఇచ్చే అవకాశాన్ని తలుపు తట్టినప్పుడే అందుకోవాలి.

కాలం అనే ఈ అనంత పాఠశాలలో ర్యాంకులు ఉండవు, కేవలం వ్యక్తిత్వ పరిణితి మాత్రమే ఉంటుంది. విద్యార్థి దశలో క్రమశిక్షణను, వృత్తి జీవితంలో నిరంతర అభ్యాసాన్ని అలవరచుకున్నప్పుడే కాలం అనే గురువు మనకు విజయం అనే పూలమాలను బహూకరిస్తుంది. నిన్నటి తప్పును నేటి పాఠంగా మార్చుకుని, రేపటి లక్ష్యం వైపు అడుగులు వేద్దాం.గుర్తుంచుకోండి కాలం ఎవరికోసం ఆగదు, కాలాన్ని వాడుకున్నవాడు ఎవరికీ లొంగడు.